
ప్రజాశక్తి

గురువారం 16 జనవరి 2025

5

పార్వతీపురం మన్యం



కోట దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో గల కోట దుర్గమ్మను అమ్మవారిని సంక్రాంతి పండుగ సందర్భంగా పలు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాఖధికారి సూర్యనారాయణ వారికి సాదరంగా స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీరామ సత్యనారాయణ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. హైకోర్టు జడ్జి అనుపమ చక్రవర్తి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టిడ్కో ఇళ్ల పంపిణీ జరిగేదెప్పుడో!

- లబ్ధిదారులు ఎదురుచూపు
- నిర్మాణాలు పూర్తి
- మౌలిక సదుపాయాలు నిల్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలో ఇళ్లులేని నిరుపేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్ల పంపిణీ కోసం సంబంధిత లబ్దిదారులు ఏడేళ్లుగా కళ్లు కాయలు కాచి ఎదురు చూపులు చూసినప్పటికీ ఇళ్లు మాత్రం వారి చేతికి రాలేదు. ఈ ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ పంపిణీ జరిగేది ఎప్పుడో అని లబ్ధిదారులు వాపోతున్నారు. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడేళ్ల తర్వాత ఇళ్లు లేని పేదలకు షేర్ వాల్ టెక్నాలజీతో టిట్కో ఇళ్లను సబ్సిడీతో బ్యాంకు లోన్ ద్వారా కట్టించి ఇస్తామని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. మున్సిపాలిటీ పరిధిలోని 1488 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి, కేటగిరి-1 లో 300 చదరపు అడుగులకు రూ.500, కేటగిరి-2 లో 365 చదరపు అడుగులకు రూ.50వేలును రూ.12,500 చొప్పున నాలుగు దఫాలుగా చెల్లించేందుకు, కేటగిరి-3 లో 430 చదరపు అడుగులకు లక్ష రూపాయలను రూ.25 వేలు చొప్పున నాలుగు దఫాలుగా చెల్లించేందుకు కమిషనర్ పేరు మీద బ్యాంకులో రెండు కోట్ల రూపాయలు డి డి ల రూపంలో చెల్లించారు. అయితే రెండేళ్లయినా ఆ నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆ నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టును రద్దుచేసి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. అయితే వైసిపి ప్రభుత్వం హయాంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఎంపికైన 1488 మంది లబ్ధిదారులను కుదించి మున్సిపాలిటీలో పలు వార్డుల్లో ఇళ్లులేని 768 మంది లబ్ధిదారులకు 300 చదరపు అడుగుల ఇళ్లను ఒక్క రూపాయికి ఇచ్చేందుకు పార్వతీపురం మండలం అడ్డాపుశిల వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో 16 బ్లాకుల్లో టిడ్కో గృహ సముదాయాలను నిర్మించారు. లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఈ పనులు కూడా కొంత స్థాయిలో పూర్తయ్యాయి. కానీ, ఈ గృహ సముదాయాలకు కావాల్సిన తాగునీరు, రోడ్లు, కాలువలు, విద్యుత్ సరఫరా తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు పూర్తి కాలేదు. ఎన్నికలకు ముందు ఆ పనులను త్వరగా పూర్తి చేసి పంపిణీ చేసేందుకు వైసిపి ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో పాటు కాంట్రాక్టర్‌కు బిల్లులు బకాయి ఉండడంతో పనులు జరగలేదు. ఈ మున్సిపాలిటీకి చెందిన వైసిపి సీనియర్ నాయకులు జమ్మాన ప్రసన్న కుమార్‌కు వైసీపీ ప్రభుత్వ హయాంలో టిట్కో చైర్మన్ పదవి ఇచ్చినప్పటికీ ఈ ఇళ్లు లబ్ధిదారులకు ఇచ్చేందుకు పూర్తి స్థాయిలో చొరవ చూపలేదనే విమర్శలు లబ్ధిదారుల నుండి వెల్లివెత్తాయి. ఐదేళ్లు పూర్తయిన కూడా వైసీపీ ప్రభుత్వము టిట్కో ఇళ్లను అసంపూర్తిగా పూర్తిచేసి రంగులు వేశారే తప్ప లబ్ధిదారులకు అందించడానికి కృషి చేయలేదనే విమర్శలు వినిపించాయి.



పూర్తయిన టిడ్కో ఇళ్ల సముదాయాలు

అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఇళ్లను లబ్దిదారులకు అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలలు కావస్తున్నప్పటికీ టిట్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు కృషి చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఇళ్లు ఎప్పుడు తమకు చేరుతాయోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర టిడ్కో ఇళ్లను పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని, ఈ ఇళ్ల కోసం బ్యాంకులో డిడి రూపంలో లక్షలాది రూపాయల చెల్లించిన మిగతా బాధిత లబ్దిదారులకు నగదును ప్రభుత్వం నుంచి తిరిగి ఇచ్చేందుకు కృషి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇల్లు లేదు... డబ్బులు ఇవ్వరు..



ఏడేళ్ల క్రితం టిట్కో ఇంటి కోసం డబ్బులు చెల్లిస్తే ఇంతవరకు ఇల్లు ఇవ్వలేదు. సరికదా, డబ్బులు కూడా మున్సిపల్ అధికారులు చెల్లించలేదు. తాను ఒక ప్రైవేటు పాఠశాలలో చిరు ఉద్యోగిగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. సొంత ఇంటి కోసం ఆశపడి అప్పులు చేసి బ్యాంకులో డిడి చెల్లించాలంటే అప్పు చేసి కట్టారు. అప్పు చేసి డబ్బుకు వడ్డీ చెల్లిస్తున్నాను. డబ్బులు చెల్లించాలని పలుమార్లు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ అధికారులు స్పందించ లేదు.

- సోమేష్ , ప్రైవేట్ ఉద్యోగి

పీడీ నియామకాల్లో సీనియర్లకు ఝలక్

ఐసిడిఎస్‌లో అడ్డగోలుగా ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

మహిళా శిశు సంక్షేమ శాఖలో ప్రాజెక్టు డైరెక్టర్ నియామకాల్లో సీనియర్లకు ఝలక్ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దండిగా చేయి తడిపిన వారికి జూనియర్ అధికారి నైనా అందలమెక్కించడం ఈ శాఖ లో పరిపాటి గా మారింది. ఇటీవల మహిళా శిశు సంక్షేమ శాఖలో జరిగిన ప్రాజెక్టు డైరెక్టర్ నియామకాల్లో సీనియర్లను పక్కన పెట్టి జూనియర్ అధికారులను పీడీలుగా నియమించడం వివాదాస్పద మవుతోంది. ఇటీవల ఐసిడిఎస్‌లో ఏడు జిల్లాలకు ప్రాజెక్టు డైరెక్టర్‌లుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మన్యం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ గా పని చేస్తున్న ఎంఎన్ రాణిని ఆ పోస్టు నుంచి తప్పించి ఆమె కంటే జూనియర్ అయిన రాజాం ఐసిడిఎస్ సిడిపిఒ కనకదుర్గను మన్యం జిల్లా పీడీగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ అయిన ఎంఎన్ రాణి గత ఏడాది కాలంగా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.



వాస్తవంగా ఆమె ఉద్యోగోన్నతుల జాబితాలో ముందు వరుసలో వున్నప్పటికీ ఆమెకు ఆ పోస్టు అందని ద్రాక్షలా చేశారు. ఈ వ్యవహారంపై మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. సాక్షాత్తూ రాష్ట్ర శిశు సంక్షేమ శాఖమంత్రి సొంత జిల్లాలో ఈ తతంగం జరగడం చర్చనీయాంశమైంది.

అయిన వారికి ఆకులు... కానివారికి కంచాలు

మహిళా శిశు సంక్షేమ శాఖలో అధికారుల నియామకాల తీరు అయిన వారికి ఆకులు, కానివారికి కంచాలు అన్న చందంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ, సహకార శాఖలో పని చేసిన డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను పీడీలుగా నియమించారు. శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో ఇతర శాఖల అధికారులే ప్రాజెక్టు డైరెక్టర్లుగా పని చేస్తున్నారు. ప్రభుత్వం మారినా వారినే కొనసాగించడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఒక ఏడాది కాలపరిమితికే డెప్యుటేషన్‌పై నియమితులైన పీడీలను టిడిపి ప్రభుత్వం హయాంలోనూ కొనసాగించడం వెనుక అవినీతి భాగోతమే కారణమని చర్చ జరుగుతోంది.

వైసిపి జిల్లా పదవుల్లో సాలూరుకు పెద్దపీట

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి పార్వతీపురం మన్యం జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకంలో భాగంగా నియోజకవర్గంలో పలువురు నాయకులకు జిల్లా స్థాయి పదవులు లభించాయి. మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర సిఫార్సులతో నియోజకవర్గంలో నలుగురికి జిల్లా స్థాయి అనుబంధ విభాగాల అధ్యక్షులుగా చోటు దక్కింది. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా రెడ్డి పద్మావతిని మళ్లీ నియమించారు. మాజీ జెడ్పీటీసీ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్ పర్సన్ అయిన రెడ్డి పద్మావతి క్రియాశీల రాజకీయాల్లో చురుగ్గా పని చేస్తున్నారు. ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడిగా గిరి రఘును నియమించారు. మున్సినల్ జెసి ఎస్ కన్వీనర్‌గా, కౌన్సిలర్‌గా ఉన్న గిరి రఘును జిల్లా స్థాయి ప్రచార విభాగం అధ్యక్షుడిగా నియమించారు. అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ అయిన తాడ్డి యశోదకృష్ణను జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా నియమించారు. సోషల్ మీడియా నియోజకవర్గ ఇంచార్జిగా వున్న పి.కృష్ణచైతన్యను వైసిపిఐటి విభాగం అధ్యక్షుడిగా నియమించారు.

మురిసిన పల్లెలు మెరిసిన ముంగిళ్లు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

తెలుగువారు అత్యంత ఆనందంగా ఎదురుచూసే భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని పల్లెలు బంధుమిత్రుల కోలాహలంతో సందడిగా మారాయి. ఏ ఇంటి ముంగిటి చూసినా రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దుతూ మహిళలు ఒకరితో ఒకరు పోటీపడ్డారు. అలాగే దూరప్రాంతాల నుంచి వచ్చిన ఆత్మీయులు, రక్త సంబంధీకులు పలకరింపులతో పల్లెటూళ్లలో కొత్త కొత్త వాతావరణం. సంక్రాంతి రోజున పూర్వీకులకు బట్టలు చూపిస్తూ, విస్తర్లలో బియ్యం, కూరగాయలు నింపి దానాలు, తర్పణాలు కొనసాగించారు. అనంతరం కొత్త బట్టలు ధరించిన యువతరం కోలాహలంగా వీధుల్లో తమ ఈడు వ్యక్తులను పలకరిస్తూ వారితో కలిసి మెలిసి తిరుగుతూ పాత ముచ్చట్లను గుర్తు చేసుకుని ఎంతగానో ఆనందించారు. ఒక్కసారిగా బంధుమిత్రుల రాకలతో రహదారులన్నీ కిక్కిరిసిపోతూ పండగ వాతావరణాన్ని రంజింపచేశాయి. ఇరుగు పొరుగు వారికి తాము చేసిన పిండి వంటలను పంపిణీ చేస్తూ మురిసిపోయే వాతావరణం కనిపించింది. దూరపు ప్రాంతాల్లో బతుకుతెరువు కోసం వెళ్లిన వలస జీవులు ఇళ్లకు చేరుకోవడంతో ఏ ఒక్క వీధిని చూసిన సందడి వాతావరణం కనిపించింది. యువత పండగను క్రీడల వైపు మళ్లించి పలు గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్ పోటీలను నిర్వహించి, క్రీడా స్ఫూర్తిని కొనసాగించారు. బుధవారం కనుమ రోజు పశువులకు పసుపు, కుంకుమలు పూసి వాటికి పూజలు చేస్తూ కృతజ్ఞతలు తెలుపుకొని అనంతరం మాంసాహార వంటలతో పండుగ రివాజును కొనసాగించారు. ఈ ఏడాది వరుస తుఫానులకు గురై ఎడతెరిపిలేని వానలను చూసిన గ్రామీణులు ఒక్కసారిగా వాతావరణం తేలికపడి, పొగ మంచు చలి వాతావరణంతో వేకువ ఝామున పల్లె అందాలు దిగుణీకృతం చేశాయి. ఏడాది మొత్తం ఎదురుచూసే సంక్రాంతి పండగ కళ్లముందే మూడు రోజులు కరిగిపోవడంతో భారంగా ముక్కనుమ నుండి తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతున్నారు.



గంగిరెడ్డికు కానుకలు అందజేస్తున్న స్థానికులు

వీరఘట్టం: మండలంలో సంక్రాంతి పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్మి గ్రామంలో ముగ్గులు, పాటల పోటీలు, మ్యాజిక్కు చైర్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మోరు సినీ పాటుకు కొండపల్లి సిరి. ఉదయాన అనిల్ కుమార్ బృందానికి ప్రథమ బహుమతి లభించింది. ముగ్గుల పోటీలకు కొండపల్లి కళ్యాణికి ప్రథమ బహుమతి లభించింది. అదేవిధంగా జన విజ్ఞాన ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మహేశ్వర రావు మ్యాజిక్‌షో నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరమణమూర్తి, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కొండపల్లి గౌరు నాయుడు,గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని బూర్జలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు బందు,మిత్రులతో కలిసి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. సంప్రదాయ వస్త్ర ధారణ, పిల్లల ఆట పాటలతో కను విందు చేశారు. ప్రతి ఇంటా వేసిన రంగు రంగుల సంక్రాంతి ముగ్గులను తిలకించి సంస్కృతి,సాంప్రదాయాలను ఇనుమడింప జేసిన ముగ్గులను కొనియాడి ప్రశంసించారు. రైతు వేష ధారణలో డాక్టర్ జగన్మోహన్ వ్యవసాయ ట్రాక్టర్‌ను గ్రామంలో నడిపి ఆకట్టుకున్నారు. బాల్య స్నేహితులతో గత స్మృతులను గుర్తు చేసుకొని సరదాగా గడిపారు. బూర్జ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ హేమాక్షి, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.



వీరఘట్టంలో సంక్రాంతి నేపథ్యంలో అమ్మోరు వేషాధరణలో ఉన్న సిరి


పాలవలసకు ఘన నివాళి

ప్రజాశక్తి - పాలకొండ

జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, వైసిపి పాలవలస రాజశేఖర్ మృతికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుమారుడు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను, రాజశేఖర్ సతీమణి రేగిడి జడ్పిటిసి ఇందుమతిని రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పరామర్శించారు. మంగళవారం రోజు రాజాం, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు కొండ్రు మురళీమోహన్ గోండు శంకర్ పరామర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ధర్మాన కృష్ణదాసు, మాజీఎమ్మెల్యే కళావతి, కంబాల జోగులు, అలజంగి జోగారావు, దేవాదాయ శాఖ స్పెషల్ చీఫ్ కార్యదర్శి శ్రీరామ సత్యనారాయణతో పాటు చుట్టుపక్కల నాయకులు రాజశేఖర్ మృతదేహాన్ని ఘనంగా నివాళులర్పించారు. బుధవారం రాజశేఖర్ స్వగ్రామైన అంపిలిలో నాగావళి నది సమీపంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీమంత్రి పీడిక రాజన్న దొర, విజయనగరం జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నగర పంచాయతీచైర్మన్ పల్లా ప్రతాపు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్‌పి ముఖ్య నేతను కోల్పోయామన్నారు. రాజకీయంగా ఎనలేని సేవలు అందించారని,ఆయనలోని లోటు తీరని పేర్కొన్నారు.



పాలవలస కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



రాజశేఖర్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

ఎక్కడి గుంతలు అక్కడే

- పూడ్చిన చోటల్లా ఉమ్మితడి పనులే
- సంక్రాంతికొచ్చిన జనాలకు దర్శనమిచ్చిన వైనం
- నెరవేరని చంద్రన్న హామీ

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలో రహదారులపై ఎక్కడ గుంతలు అక్కడే దర్శనమిస్తున్నాయి. సంక్రాంతి నాటికి రహదారులపై గుంతలు కనిపించకూడదన్న సిఎం చంద్రబాబు నాయుడు మాట చెల్లుబాటు కాలేదు. రాష్ట్రంలోని అన్ని ఆర్ అండ్ బి రహదారులపై గుంతలు సంక్రాంతికి కనిపించకూడదని ముఖ్యమంత్రి డెడ్ లైన్ విధించారు. అయితే ఆయన మాట చెల్లుబాటు కావడానికి తగిన సమయం లేకనో, మరే ఇతర కారణాల వల్ల నో రహదారులపై గుంతలు మాత్రం యధావిధిగా వున్నాయి. ఆర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం వల్లనే రహదారులపై గుంతల పూడ్చివేత పనులు పూర్తి కాలేదని తెలుస్తోంది. జిల్లాలో 46 రహదారుల్లో గుంతలను పూడ్చడానికి రూ.12.5 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో కనీసం 50 శాతం పనులు కూడా పూర్తి కాకపోవడంతో ప్రధాన రహదారుల్లో గుంతలు ఎప్పటిలాగే దర్శనమిస్తున్నాయి. సంక్రాంతి పండుగ సొంత గ్రామాలకు తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర, ఎంపి రాష్ట్రాల నుంచి వచ్చిన జనాలకు రహదారులు గుంతలతోనే కనిపించాయి. పార్వతీపురం నుంచి వెంకంపేట, ఎంఆర్ నగరం మీదుగా ఒడిశాలో ఉన్న నారాయణ పట్నంకి వెళ్లే రహదారి పెద్దపెద్ద గుంతలతో కనిపిస్తోంది. దీంతో ఈ రహదారి మీదుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పుడప్పుడు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఐదేళ్లలో కూడా రహదారులపై గుంతలు పూడ్చివేత పనులు జరగకపోవడంతో అవి భారీ వర్షాలకు పెద్ద పెద్ద గుంతలుగా మారుతున్నాయి. సంక్రాంతికి సరిగ్గా రెండు నెలముందే గుంతల పూడ్చివేతకు నిధులు మంజూరు చేయడం, అధికారులు సకాలంలో టెండర్ ప్రక్రియ పూర్తి చేయకపోవడం తో పనులు పూర్తి కాలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అధ్వాహ్నం ఉన్న పార్వతీపురం- నారాయణపురం మధ్య గల రోడ్డు దుస్థితి

చేసిన పనులు మొక్కుబడి

జిల్లాలో అక్కడక్కడ చేసిన గుంతల పూడ్చివేత పనులు కూడా మొక్కుబడిగానే జరిగాయి. ఈ పనులు జరిగిన కొద్ది రోజులకే మళ్లీ గుంతలుగా మారాయి. జిల్లాలోని సాలూరు మండలం దండిగాం రహదారిపై గుంతలు పూడ్చివేత పనులు చేపట్టారు. వాహనాల రద్దీ ఎక్కువగా వుండే ఈ రహదారిపై గుంతలు పూడ్చివేత పనులు మొక్కుబడి గా చేపట్టినట్లు కనిపిస్తోంది. ఈనెల 27 నుంచి ప్రఖ్యాత శంబర పోలమాంబ జాతర ప్రారంభం కానుంది. ఈ జాతర సందర్భంగా సుమారు నెలల పాటు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఇరుగుపొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రానున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదరాబాదరాగా చేపట్టిన పనుల్లో నాణ్యత ఏమేరకు వుంటుందనేది చర్చనీయాంశమైంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తక్షణమే రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

కొండెక్కిన మాంసం ధరలు

కిక్కిరిసిన మటన్, చికెన్ షాపులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సంక్రాంతి పండగ ప్రధాన ఘట్టనగా భావించే కనుమ పండుగ నేపథ్యంలో మాంసం ధరలు కొండాక్కాయి. సంక్రాంతి పండగ సందర్భంగా చిన్నా, పెద్ద, ధనిక,పేద అనే తేడా లేకుండా జరుపుకునే పండగ. నేపథ్యంలో కనుమ పండుగ రోజైన బుధవారం నగరంలో మటన్, చికెన్, చేపలు షాపులు రద్దీగా మారాయి. నగరంలో ఏ షాపు వద్ద చూసిన అధిక సంఖ్యలో మాంసం కోసం క్యూ కడుతున్నారు. ఇది ఒక వైపు ఉంటే ఇదే అదునుగా మొన్నటి వరకు కేజీ చికెన్ ధర రూ.160 ఉంటే ప్రస్తుతం నుంచి రూ.200, రూ.220కు పెరిగింది. అలాగే మటన్ రూ,850 నుంచి రూ.1000కు పెంచేశారు, చేపలు కిలో రూ.130 నుంచి రూ.150కు పెంచి విక్రయించారు. అలాగే వీటి రకాలను బట్టి కూడా అధిక రేట్లకు విక్రయించారు.



మాంసం దుకాణం వద్ద బారులు తీరిన జనం



నిర్మానుష్యమైన ప్రధాన రహదారి

బోసిపోయిన పట్టణం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

సంక్రాంతి పండుగ నేపథ్యంలో పార్వతీపురం పట్టణం బోసిపోయింది. రెండు రోజులు క్రితం చుట్టుపక్కల గ్రామాల నుంచి బట్టలు, నిత్యవసర వస్తువులు కొనేందుకు వచ్చే ప్రజలతో కిటకిటలాడిన పట్టణం బుధవారం బోసిపోయింది. షాపులన్నీ మూతపడ్డాయి. దీంతో రోడ్లు నిర్మాణుష్యమయ్యాయి. వాహనదారులు, పాదచారులు లేక రోడ్లు బోసిపోయాయి. ఆర్‌టిసి కాంప్లెక్స్ జంక్షన్, పాతబస్టాండ్ మూడురోడ్ల కూడలి, తదితర ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యమయ్యాయి.



పేదలకు దుస్తులు అందజేస్తున్న లక్ష్మణ్

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో బుధవారం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలబోను సూరప్పడు కుమారుడు అలబోను లక్ష్మణ్ 50 మంది నిరు పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమం నేతాజీ గ్రంథాలయం వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ్ నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రావణ్ కుమార్, గొర్లె లక్ష్మణ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాత పైడిరాజు, ఆలయ కమిటీ సభ్యులు

పైడి మారమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం గ్రామ దేవత పైడిమారమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బూరుబు పైడిరాజు రూ.2లక్షలు విరాళం ప్రకటించారు. ఆయన సొంత గ్రామం కురుపాం అయినప్పటికీ ఉద్యోగరీత్యా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డాడు. సంక్రాంతి పండగ సందర్భంగా కురుపాం వచ్చిన నేపథ్యంలో బుధవారం పైడిమారమ్మ ఆలయ కమిటీ సభ్యులకు కలిసి విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పుట్టిన ఊరు ఆలయ నిర్మాణానికి తనవంతు సాయం చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బురుబు నారాయణరావు, నెల్లి శ్రీనివాసరావు, బలగ రామకష్ణ, సంచాన పోలినాయుడు, బాల, గొంపు స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులుగా నంగిరెడ్డి

ప్రజాశక్తి - కొమరాడ



మండలం వైస్ ఎంపిపి నంగిరెడ్డి శరత్ బాబుకు పార్వతీపురం మన్యం జిల్లా వైసిపి యూత్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈసందర్భంగా శరత్ బాబు బుధవారం సమావేశంలో మాట్లాడారు. వైసిపి బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. పార్టీలో తనకు ఇంత గుర్తింపు ఇచ్చిన మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఆదుకునేలా పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. వైసిపి కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి పార్టీ బలోపేతానికి సహకరించాలని కోరారు.



ఒకే చోట కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 1989 గోల్డెన్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయతగా పలకరించుకొని. మీరేం చేస్తున్నారు, పిల్లలు ఏం చేస్తున్నారు, కుటుంబాల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది జూన్ 8న మెగా గెట్ టుగెదర్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని, ఒకరికి ఒకరు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో బోశెట్టి రామారావు, చంద్రమౌ, జీవరత్నం ఎ.మోహన్, వడ్డాది శ్రీనివాసరావు, కృష్ణ,కుమార్ స్వామి, అనంత్, సీతమనాయుడు, జి శ్రీనివాసరావు , తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - సాలూరూరల్

సాలూరు నుండి దుగ్గేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని పట్టణంలోని లెప్రసీ కాలనీ చెందిన బలగ శ్యామ్‌సన్ (19) మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం బాగువలస వెళ్లిన శ్యామ్‌సన్ తిరిగి ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు చంద్రప్పవలస విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. ఆర్టీసీ డ్రైవరును అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

టిఫిన్ కొట్టు దగ్ధం

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రమైన సంత మార్కెట్ సమీపంలో గల గోర్లు ప్రకాష్ రావు టిఫిన్ కొట్టు సోమవారం రాత్రి దగ్ధమైంది. ఈ విషయమై స్తానికులు అగ్నిమాపకం కేంద్రానికి సమాచారం అందించారు. ఈ శకటం వచ్చి మంటలను అదుపు చేసింది. అప్పటికే కొంత ఆస్తి నష్టం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

ఏజెన్సీలో

పారిశ్రామిక ప్రగతి ఏదీ?

- అభివృద్ధికి నోచుకోని చిన్న తరహా పరిశ్రమలు
- ఉపాధి లేక వలస బాట పడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన యువతకు గత కొన్నేళ్లుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలస బాటపడుతున్నారు. గుమ్మలక్ష్మీపురం మన్యంలో చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి గిరిజనులకు ఉపాధి కల్పించాలని కోరుతున్నా పాలకులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ప్రభుత్వాలు మారినా గిరిజన బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు ఐటిడిఎ పిఒలు చేసిన కృషితో కొన్నేళ్లపాటు గిరిజనులకు ఉపాధి దొరికేది. మండలంలోని పి.లేవిడిలో పట్టు పరిశ్రమ, డుమ్మంగి చేపల ఉత్పత్తి కేంద్రం, గుమ్మలక్ష్మీపురంలో ఫ్యాషన్ టెక్నాలజీ వంటివి ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చి తద్వారా ఉపాధి కల్పించేవారు. అధికారులు బదిలీలపై వెళ్లడం తర్వాత వచ్చిన పిఒలు అంతగా శ్రద్ధ చూపకపోవడంతో పరిశ్రమలు మూతపడ్డాయి.

ప్రారంభానికి ముందే మూతపడ్డ జీడి ప్రాసెసింగ్ యూనిట్లు

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి....

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో జీడి, చింతపండు, కొండ చీపుర్లు ప్రాసెసింగ్ చేసేందుకు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి గిరిజనులకు ఉపాధి కల్పించాలి. గత కొన్నేళ్ల నుంచి ఏజెన్సీలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా నేటి వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. గిరిజనులకు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది.

కోలక అవినాష్
ఆదివాసీ గిరిజన సంఘం, జిల్లా ప్రధాన కార్యదర్శి.

చేపల కేంద్రాన్ని అభివృద్ధి పరచాలి...

డుమ్మంగిలో గల చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంపై ఐటిడిఎ అధికారులు దృష్టి సారించి అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపట్టాలి. చేప పిల్లల ఉత్పత్తి ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. సొసైటీలు ఏర్పాటు చేసి చేప పిల్లలను అమ్మకాలు చేపడితే ప్రభుత్వానికి లక్షల రూపాయలు ఆదాయం వస్తుంది.

పాలక క్రాంతికుమార్,
సర్పంచి డుమ్మంగి.

గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. ఇందుకోసం జెకె పాడు, ఇరిడి, దురుబిలి గ్రామాల్లో ప్రాసెసింగ్ యూనిట్ల కేంద్రాలకు భవనాలు నిర్మించారు. యంత్ర సామగ్రి కూడా కొనుగోలు చేసి సిద్ధం చేశారు. కొంత మంది జీడి రైతులను చెన్నై పంపించి ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణపై శిక్షణ కూడా అందించారు. అంతా బాగానే ఉన్నా చివరి నిమిషంలో పిఒ సువర్ణపండ దాస్ బదిలీపై వెళ్లడంతో ఆ తర్వాత వచ్చిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రారంభానికి ముందే మూలనపడ్డాయి.

వేల ఎకరాల్లో చింత, జీడి సాగు...

పార్వతీపురం మన్యం జిల్లాలోని ఐటిడిఎ పరిధిలోని సుమారు 50 వేల ఎకరాల్లో జీడి పంట సాగులో ఉంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోనే 35 వేల ఎకరాల్లో జీడి తోటలు ఉన్నాయి. ఏటా సుమారు పది వేల క్వింటాళ్ల జీడి పంట దిగుబడి వస్తుందని అంచనా. దీన్ని బట్టి గిరిజన రైతుల జీడి పంటపై ఎంతమేర ఆధారపడి ఉన్నారో అర్థమవుతోంది. మరోవైపు ఐటిడిఎ పరిధిలో 40 వేల ఎకరాల్లో చింత చెట్లు ఉన్నాయి. ప్రతి ఏడాది 10 వేల క్వింటాళ్ల వరకు చింతపండు దిగుబడి వస్తోంది.



మూతపడిన జీడి ప్రాసెసింగ్ యూనిట్

ముందుకు రాని ప్రభుత్వ సంస్థలు...

ప్రతి ఏటా ఏజెన్సీలో జీడి పంట వ్యాపారం కోట్లాది రూపాయలు జరుగుతున్నా ఐటిడిఎ, జిసిసి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలుపై దృష్టి సారించడం లేదు. దీంతో దళారుల బెడద ఎక్కువ కావడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. మరోవైపు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి కూడా గండి పడుతోంది. చింతపండుతో పాటు జీడి పంట కూడా పదేళ్ల కిందట అధికారులు కొనుగోలు చేసేవారు. సంస్థ కష్టాలు వచ్చాయని కొనుగోలు నిలిపివేశారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

గిరిజనులు పండించే జీడి, చింతపండును ఐటిడిఎ, జిసిసి, వెలుగు ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. గిరిజనులు పండించే పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు గ్రామాల్లోకి నేరుగా వచ్చి అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలి.

మండంగి రమణ
ఎంపిటిసి, చెముడుగూడ,

ప్రిజం-10కు ప్రధానమంత్రి అవార్డు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రిజం-10 ప్రాజెక్టుకు ప్రధానమంత్రి అవార్డు లభించింది. ప్రిజం 10లో భాగంగా ముఖ్యంగా 10 సంవత్సరాల లోపు వయస్సు గల చిన్నారులలో రక్తహీనత నివారణకు పెద్ద ఎత్తున 2023 - 24 సంవత్సరంలో చర్యలు చేపట్టారు. అప్పటి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామ స్థాయిలో రక్తహీనత కమిటీలు ఏర్పాటు చేయడం, నిశితంగా పర్యవేక్షణ చేయడం ద్వారా గణనీయమైన ఫలితాలు సాధించారు.

ముఖ్యంగా పాచిపెంట మండలంలో మరిన్ని మంచి ఫలితాలు లభించాయి. పాచిపెంట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేసిన లక్ష్మీకాంత్ మండలంలో ప్రత్యేక శ్రద్ధ వహించడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వలన ఫలితాలు సాధించారు. పౌష్టికాహారం అందించడమే కాకుండా దత్తత అధికారులను గ్రామస్థాయిలో ఏర్పాటు చేసి రక్తహీనత కలిగిన వారిని దత్తత తీసుకోవడం, వారు పర్యవేక్షణ నిర్దిష్టంగా చేయడం, దీంతోపాటు కొంతమంది దత్తత అధికారులు స్వయంగా సొంతంగా ఖర్చు చేసి డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహార పదార్థాలను అందించడం కూడా చేశారు. ఇది గొప్ప స్ఫూర్తిదాయకం. ప్రస్తుత జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కూడా రక్తహీనత నివారణ పై పెద్ద ఎత్తున దృష్టి సారించారు. ఈ అవార్డు మరింత స్ఫూర్తిని నింపి జిల్లాలో మరింత ఎక్కువగా దానిపై దృష్టి సారించుటకు ప్రోత్సాహం కానుంది. చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో రక్త హీనతపై ప్రత్యేక దృష్టి సారించారు.. ఈ నెల 21న ఢిల్లీలో జరిగే బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో అప్పటి జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ బహుమతిని అందుకోనున్నారు. ప్రిజం ప్రాజెక్టు పై ఆయన చేసిన ప్రశంసనీయమైన సేవలకు గాను ఈ బహుమతిని అందిస్తున్నారు.

పండగపూట విషాదం

ప్రజాశక్తి-బొండపల్లి

పండగపూట విషాదకర సంఘటన చోటుచేసుకుంది. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. బొండపల్లి మండలం గొట్లాం వద్ద జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీ... మోటారు బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మరణించారు. గంట్యాడ మండలం రామవరం వద్ద సంభవించిన ప్రమాదంలో మరో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ యు.మహేష్ కథనం ప్రకారం...

మండలంలోని బొండపల్లి పంచాయతీ పరిధిలోని చందకపేట గ్రామానికి చెందిన వెలుగుల లవణ్ కుమార్(25) తో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన లక్ష్మణ్ రంజాన్ దాస్ (25) బైక్‌పై వస్తున్నారు. గొట్లాం జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి విజయనగరం నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీ వారిని బలంగా ఢీకొంది. దీంతో లవణ్ కుమార్, లక్ష్మణ్ రంజాన్ దాస్ అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌ను లారీ వంద అడుగుల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. లారీ డ్రైవర్ పరారయ్యాడు. మృతిచెందిన ఇద్దరు యువకులు గజపతినగరంలోని రిలయన్స్ ట్రెండ్స్ బట్టల దుకాణంలో పనిచేస్తున్నారని ఎస్ఐ మహేష్ తెలిపారు. లవణ్‌కుమార్‌కు భార్య చైతన్య లక్ష్మి, నాలుగు నెలల వయసు గల కుమారుడు దేవ దీక్షిత్ ఉన్నారు. దేవ దీక్షిత్‌కు ఈ నెల 19న బారసాల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో తండ్రి లవణ్ కుమార్ మరణించాడు. దీంతో చందకపేట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

గంట్యాడ : మండలంలోని రామవరం వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. విశాఖపట్నంలోని కంచరపాలెం ప్రాంతానికి చెందిన కె.ప్రకాశరావు విజయనగరం కలెక్టర్ ఆఫీస్ దగ్గర ఆటో ఎక్కి రామవరం వస్తున్నాడు. మార్గం మధ్యలో కారును ఆటో ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఆయన ఫోన్ నెంబర్ గాని, బంధువుల ఫోన్ నెంబర్ గాని దొరకలేదని, ఎవరికైనా ఈయన ఆచూకీ తెలిస్తే 9121109442 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సాయికృష్ణ కోరారు.

రామభద్రపురం : మండల పరిధిలోని ఆరికతోట జాతీయ రహదారి వద్ద ఆగి ఉన్న లారీని రామభద్రపురం నుంచి వస్తున్న కారు వెనుకనుంచి ఢీకొట్టింది. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించుకొనే క్రమంలో లారీని ఢీ కొట్టినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

కలిసి ఉంటే కలదు సుఖం

సంక్రాంతి సందర్భంగా ప్రజాసంఘాల ఆధ్వర్యాన సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి - సీతానగరం

కలిసి ఉంటే కలదు సుఖం ఐక్యతతో అన్ని సాధించాలని డివైఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని రెడ్డివానివలసలో యువజన, ప్రజా సంఘాలు, సిపిఎం ప్రజా ప్రతినిధులు, ప్రజ సహకారం తో సంక్రాంతి ఆటల పోటీలు యువ నాయకులు రెడ్డి నవీన్, సందీప్, కిరణ్, ప్రవీణు రైతు వ్యవసాయ కార్మిక సంఘం ఐద్వా, కళాకారుల బృందం నాయకులు, రామవరం సర్పంచు వైస్ ప్రెసిడెంట్ గ్రామ వివిధ పార్టీల పెద్దలు, సిపిఎం నాయకులు సహాయ సహకారాలతో రన్నింగ్, స్లో సైక్లింగ్, కోలాట బృందం పాటలు డాన్సులు ముగ్గుల పోటీ తగ్గా ఫోన్ తాడు లాగడం కుర్చీలాట లెమన్ స్పూను, డాన్స్ బేబీ డాన్స్, పాటలు ఆటల పోటీలు జరిగాయి. అన్ని



చిన్నారులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విజేతకు బహుమతి అందజేస్తున్న సిపిఎం నాయకులు వేణు

ఆటలకు ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులను సర్పంచ్ పెంట సత్యనారాయణ, ప్రజా సంఘాల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి లక్ష్మునాయుడు, రెడ్డి సత్యనారాయణ, రెడ్డి శ్రీదేవి, జి.నిర్మల, వి.ఇందిరా, సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి శంకర్రావు, రెడ్డి వేణు, కళాబృందం నాయకులు మూడడ్ల రాఘవ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రజల శ్రమ నుండి పుట్టిన కలలు సాహిత్యం ఆటలు పాటలు ప్రజాసంస్కృతిని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రజలను ఐక్యం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ప్రజా సంఘాలు అందరి సహకారంతో సిపిఎం కృషి చేస్తుందని తెలిపారు. యువత దీన్ని ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.

కబడ్డీ ఆడిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం మండలం, తాడికొండ గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. పండగ సందర్భంగా గ్రామంలో వివిధ రకాల ఆటలు పోటీలను నిర్వహించారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే మహిళలతో కబడ్డీ ఆడి ఉత్సాహ పరిచారు. ప్రజలందరితో మమేకమై ఒక కుటుంబంలా ఇలా సంక్రాంతి పండగ చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆటల పోటీలలో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే బహుమతుల ప్రదానం చేశారు.



వింజమ కొండపైన సందడి చేస్తున్న యాత్రికులు

వింజమ్మతల్లి కొండకు పోటెత్తిన జనం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సంక్రాంతి పండగకు వచ్చిన వారు మూడు రోజుల పాటు ఆనందంగా కుటుంబాలతో గడిపి కనుమ రోజున తాళ్లబురిడి గ్రామ సమీపంలోని తోటలకు మెరకలకు, మెట్టలపై చేరి ఒకరినొకరు అరె మరికలు మరచి చేసుకొనే మేరక పండగ గ్రామాల్లో ముఖ్య సంప్రదాయం. దీనిలో భాగంగా పార్వతీపురం మండలం తాళ్ల బురిడి వింజమ్మ కొండకు వెళ్లడం ఒక ఆనవాయితీ. ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాదీ వింజమతల్లి కొండకు బుధవారం జరిగిన కనుమ పండుగ సందర్భంగా జనం పోటెత్తారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత ముచ్చట్లు గుర్తు చేసుకుంటూ, ఎంతో ఆనందంగా గడిపారు. ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్థానిక వింజమతల్లి యువజన సంఘం సభ్యులు ముందస్తు ఏర్పాటు చేశారు. కొండపై విద్యుత్ దీపాలు అలంకరించడమే కాకుండా తాగునీటి సౌకర్యం కల్పించారు. అలాగే నర్సిపురం గ్రామ శివారులలోని మెరకలో జరిగిన పండగకు జనం వెలువలారలివచ్చారు.

చిన్ననీటి పారుదల శాఖపై చిన్నచూపు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎకు అనుబంధంగా ఉన్న ఎస్ఎంఐ మైనర్ ఇరిగేషన్ చిన్న నీటిపారుదల, జనవనరుల శాఖ గత కొన్నేళు ్లగా నీరసిస్తుంది. ఒకప్పుడు ఐటిడిఎకు వెన్నుముకలాగా నిధులతో పుష్కలంగా కనిపించేది. ప్రస్తుతం నిధులు లేమితో కొట్టుమిట్టాడుతుంది. ఐటిడిఎ స్థాపించి కొన్నేళ్లకే ఎస్ఎంఎస్ మైనర్ ఇరిగేషన్ ఇంజినీరింగ్ శాఖను ఏర్పాటు చేశారు. ఇక్కడ సాగునీరు ఏజెన్సీ గ్రామాల్లో తక్కువ ఉండడంతో ఈ శాఖ ద్వారా చెరువులపై చెక్ డ్యాములు ఏర్పాటు చేసి నీటిని సంరక్షించుకోవాలని ఉద్దేశంతో కొన్నేళ్ల క్రితమే ఏర్పాటు చేశారు. అప్పట్లో సుమారు ఏడాదికి రూ.ఐదు కోట్లుతో పనులు చేపట్టి 14వేల ఎకరాలకు సాగునీరందించేవారు. సీతంపేట ఎస్ఎంఐ డివిజన్ పరిధిలో సీతంపేట, పలాస, పాతపట్నం మూడు సబ్ డివిజన్లో ఉండేవి. డివిజన్ స్థాయిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జిల్లాస్థాయిలో కార్యాలయం ఉండేది. సబ్ డివిజన్ స్థాయిలో డిఇలు, జెఇలు ఉండేవారు. 2019లో సీతంపేటలో గల ఇఇ కార్యాలయాన్ని ఎత్తివేసి అదే శాఖలో శ్రీకాకుళం క్వాలిటీ కంట్రోల్‌గా విలీనం చేశారు. సీతంపేటలో ప్రస్తుతం డిఇ కార్యాలయం ఉన్నప్పటికీ శ్రీకాకుళంలో గల డిఇ వేణుగోపాల్ ఇన్చార్జి డిఇగా వ్యవహరిస్తున్నారు. నలుగురు జెఇలకు ఇద్దరు జెఇలు మాత్రమే ఉన్నారు. ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఇక నాలుగో తరగతి సిబ్బంది అయితే చెపాల్సిన అవసరం లేదు.

2023, 24లో 20 చెక్ డాముల్లో ఒక్కొక్క చెక్‌డాంకు రూ.6లక్షల నుంచి రూ.10 లక్షలు మంజూరైతే ఇప్పటి వరకు 8చెక్ డ్యాములు మాత్రమే పూర్తి చేశారు. 2023లో ఐటిడిఎ ద్వారా మంజూరైన సిసిడిపి నిధులతో పనుల్లేక వరద గోడలు పనులు చేయించారు. గత మూడేళు ్లగా కనీసం పనులు చేయకపోవడంతో సాగునీరందని పరిస్థితి ఈ శాఖకు దాపురించింది.



మరమ్మతుకు గురైన గుమ్మడిగెడ్డ చెక్ డాం

పనులకు ప్రతిపాదనలు పంపిస్తున్నాం

ఇటీవల కాలంలోనే డిఇగా ఇన్చార్జి బాధ్యతలు స్వీకరించాను. చెక్‌డ్యాంల మరమ్మతులు కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను ప్రతిపాదనను పంపిస్తున్నాం. తహశీల్దార్ ఆయకట్టు సర్టిఫికెట్ ఇస్తే ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపిస్తాం.

వేణుగోపాలరావు,
డిఇ మైనర్ ఇరిగేషన్ ,

గుమ్మడిగెడ్డ చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టాలి

కనీసం 10 ఎకరాల ఆయకట్టుకు గుమ్మిడిగెడ్డ చెక్‌డాం ద్వారా సాగునీరందితుంది. గతంలో ఈ చెక్ డాములు, చెరువులు పనులు చేపట్టేవారు ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు

ఎస్పీపెంటయ్య , సామాజిక కార్యకర్త

పిఎంఇజిపితో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం (పిఎంఇజిపి)తో స్వయం ఉపాధి అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పిఎంఇజిపిలో వివిధ రంగాల్లో స్వయం ఉపాధి కలాపాలకు రుణాలు అందిస్తుందని ఆయన చెప్పారు. తయారీ రంగ కార్యకలాపాలకు రూ.50 లక్షలు, సేవా రంగ విభాగానికి రూ.20 లక్షల వరకు బ్యాంకు రుణం లభిస్తుందని ఆయన చెప్పారు. మొత్తం ప్రాజెక్ట్ వ్యయంలో 35 శాతం వరకు ప్రభుత్వ సబ్సిడీ ఉంటుందని, లబ్ధిదారుని వాటా 5 నుండి 10 శాతం ఉంటుందని అన్నారు. నూతన మైక్రో యూనిట్లకు మాత్రమే ఆర్థిక సహాయం లభిస్తుందని స్పష్టం చేశారు. పిఎంఇజిపి, ఆర్ఇజిపి, ముద్ర పథకంలో భాగంగా రెండోదశ రుణంలో తయారీ రంగానికి రూ.1 కోటి వరకు బ్యాంకు రుణం, సేవా రంగ కార్యకలాపాలకు రూ.25 లక్షలు లభిస్తుందని తెలిపారు. ప్రాజెక్ట్ వ్యయంలో 15 శాతం వరకు ప్రభుత్వ సబ్సిడీ ఉంటుందని ఆయన చెప్పారు.

ఇందుకు 18 సంవత్సరాలకు పైగా వయస్సు కలిగిన వ్యక్తులు అర్హులని తెలిపారు. వ్యక్తిగత ఆదాయ పరిమితి లేదని, రూ.10లక్షలు పైబడిన తయారీ రంగ పరిశ్రమలకు, రూ.5 లక్షలు పైబడిన సేవా రంగ పరిశ్రమలకు కనీస విద్యార్హత 8వ తరగతి ఉత్తీర్ణత ఉండాలని ఆయన చెప్పారు. కొత్తగా ప్రారంభించే పరిశ్రమలకు మాత్రమే ఈ సబ్సిడి వర్తిస్తుందని ఆయన తెలిపారు. వి వ ం ా ల క ✓ ు www.kviconline.gov.in/pmegpe-portal వెబ్‌సైట్‌లో చూడవచ్చని, దరఖాస్తులు ఆన్లైన్‌లో సమర్పించాలని ఆయన వివరించారు. వివిధ వ్యాపార ఆలోచనలకు ప్రతి ఆదివారం ప్రత్యక్ష వెబినార్ లో పాల్గొనవచ్చని, అందుకు %http://www.udyami.in.workshop% లో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.